క్లుప్తంగా

అభయ ప్రదాయినిగా బండ్లమ్మ



చందోలు(పిట్టలవానిపాలెం) : చందోలులో వేంచేసిన శ్రీ బగళాముఖి బండ్లమ్మ వారికి దేవాలయంలో శ్రావణ మాసం రెండవ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అభయప్రదాయినిగా అలంకరించి, పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ ఈఓ నరసింహమూర్తి, సిబ్బంది ఉన్నారు.

బూరుగులమ్మ కొలుపులు



రేపల్లె రూరల్: పవిత్ర శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ దేవత బూరుగులమ్మ ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు నంది వెలుగు భానుసుధాకర్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరణగావించారు. పసుపు, కుంకుమలు, 108 బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో మేళతాళాలతో ఊరేగింపుగా సారెను అమ్మవారికి తీసుకువచ్చారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



చేబ్రోలు: గిడుగు రామ్మూర్తి పంతులు 160వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా మాధుర్యం అంశంపై గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించారు. చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కె. సృజిని, పి. దుర్గాభవాని వ్యాస రచన, సామెతల వివరణ పోటీల్లో ప్రతిభ చూపారు. జిల్లా కలెక్టరు ఎం.వేణుగోపాలరెడ్డి తదితరుల చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. విద్యార్థినుల్ని ప్రిన్సిపాల్ వి. శ్రీదేవి, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక రోగాలకు చెక్

గుంటూరు రూరల్: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక రోగాలను సులువుగా తగ్గించవచ్చని ఆయుర్వేద వైద్యుడు వైద్యనామాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగర శివారులోని రెడ్డిపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేద వైద్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు పోపూరి శిరీష, ఎం.రామారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

పెదనందిపాడు: అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని మండల మాజీ కన్వీనర్, కమ్మ కార్పొరేషన్ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ మదమంచి వాసు కోరారు. ఆదివారం మధ్యాహ్నం అన్నపర్రు గ్రామంలోని శివాలయం కల్యాణ మండపంలో జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో విజయం దిశగా పార్టీ కార్యాచరణ రూపొందించిందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలనకు బ్రహ్మరథం

- ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

కళ్ళిఫలం(నిజాంపట్నం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు రాష్ట్ర ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని కళ్ళిఫలం గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి ఒక్కొక్క కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో ఎంపీ మోపిదేవి వివరించారు. గ్రామస్తులకు సంక్షేమ కర పత్రాలను అందజేశారు. గ్రామస్తులు స్థానికంగా నెలకొన్న అంతర్గత రోడ్లు, పలు సమస్యలను ఎంపీ మోపిదేవి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు చేసి, పేదలకు ఆర్థిక భద్రత, భరోసా కల్పించే దిశగా సీఎం జగనన్న అడుగులు వేస్తున్నారని ఈ సందర్భంగా ఎంపీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు, అర్హులకు నివేశన స్థలాలు ఇస్తూ.. నాడు-నేడుతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష నాయకులు సహకరించకపోయినా పర్వాలేదని, అడ్డురాకూడదని హితవు పలికారు. స్వర్ణయుగాన్ని తలపించేలా పాలన అందిస్తూ.. ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని, పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు హరనాథబాబు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి, సర్పంచ్ బెల్లంకొండ చిట్టిబాబు, నాజర్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

పార్టీ జిల్లా కమిటీ సభ్యులకు మంత్రి నాగార్జున అభినందన



వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్ష, కార్యనిర్వాహక సభ్యుడిని సత్కరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి నూతనంగా పార్టీ జిల్లా కమిటీకి ఎంపికైన ప్రతి ఒక్కరూ పాటుపడాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. కొల్లూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించబడిన అయిల సుబ్బారావు, కార్యనిర్వాహక సభ్యుడు చిలకా ప్రకాశం మంత్రిని మేరుగను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారిద్దరినీ శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేసి మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు బాటలు పడ్డాయన్నారు. ఆర్థిక అసమానతలు తొలగించి, పేదరికాన్ని నిర్మూలించడానికి సీఎం నిరంతరం పాటుపడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా కమిటీకి ఎంపికైన ప్రతి ఒక్కరూ అన్ని వర్గాల్లో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయాలని, ఇందుకు పార్టీ విధివిధానాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. తమపై నమ్మకంతో పదవులు దక్కడానికి కారణమైన మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ మోపిదేవి వెంకట రమణారావుకు అయిల సుబ్బారావు, చిలకా ప్రకాశం కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కొల్లూరు వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఈపూరు, గాజుల్లంక సొసైటీ బ్యాంక్ చైర్మన్‌లు సూర్యదేవర రామకృష్ణ, తూము నాగేశ్వరరావు, పార్టీ నాయకులు కమ్మెల సాంబశివరావు, గంట శివరంగారావు, ఉప్పు శ్రీనివాసరావు, బారెడ్డి సుబ్బారెడ్డి, కొలిపాకుల సత్యనారాయణ, బిట్రగుంట రాజేంద్ర, అయిల సురేష్, గంగిరెడ్డి వసంతరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషిచేద్దాం

ఎమ్మెల్యే కోన రఘుపతి



ఎమ్మెల్యే కోన రఘుపతిని సన్మానించిన పరమానందకుమార్, నాగేశ్వరరెడ్డి

కర్లపాలెం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి అందరూ కలసి కృషి చేద్దామని ఎమ్మెల్యే కోన రఘుపతి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన మందపాటి పరమానందకుమార్, కార్యవర్గ సభ్యుడు ఆట్ల నాగేశ్వరరెడ్డి ఆదివారం ఎమ్మెల్యే కోన రఘుపతిని కలసి, తమ నియామకానికి కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. శాలువా, పూలమాలతో ఆయనను సన్మానించారు. అనంతరం రేపల్లె వెళ్లి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ మోపిదేవి వెంకటరమణరావును మర్యాదపూర్వకంగా కలిశారు. పరమానంద కుమార్, నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ తమ మీద నమ్మకంతో పార్టీ పదవులు ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కోన రఘుపతి విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యల్లావుల ఏడుకొండలు, మండే విజయకుమార్, పేరాల వెంకట సురేష్, డి.శివారెడ్డి, పి.లక్ష్మారెడ్డి, మార్పు బెనర్జి, యారం ఇసాక్, సుభాష్ చంద్రబోస్, కిరణ్‌కుమార్ ఉన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: నిరుపేదల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు నండూరి జయరాజు జయంతిని పురస్కరించుకుని చెంచుపేటలోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎస్.పార్థ, ఎస్.మహారాజు, ఎస్.తారకరాజు, డి.సురేష్, కె.శ్రీధర్, జి.రాము, టి.రవి పాల్గొన్నారు.

పిల్లలకు ఉచిత వైద్యశిబిరం

తెనాలి: మండలంలోని జగ్గడిగుంటపాలెం ప్రగడ కోటయ్య వీవర్స్ కమ్యూనిటీ హాలులో పిల్లల ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని ప్రముఖ పిల్లల వైద్యశాల న్యూ లైఫ్ చిల్డ్రన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 179 మంది పిల్లలకు పరీక్షలు చేశారు. డాక్టర్ రాధికా రాజశేఖర్ కుప్పా, డాక్టర్ కేటీఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ అఖిల్ గారపాటి సేవలందించారు. కార్యక్రమంలో సర్పంచి కంభం బాలాజీ, న్యూ లైఫ్ చిల్డ్రన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ కుప్పా హాజరయ్యారు.

నూర్‌బాషా సంఘీయుల ఆత్మీయ సమావేశం

తెనాలిరూరల్: స్థానిక కొత్తపేటలోని రాధాకృష్ణ కల్యాణ మండపంలో ఆదివారం దూదేకుల నూర్‌బాషా సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో తాడిబోయిన హరిప్రసాద్, షేక్ చిన మస్తాన్, షేక్ బాజీ, దూదేకుల నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు దూదేకుల బాజి, కార్యదర్శి చిన్నవలి, కమిటీ సభ్యులు షేక్ జాన్‌సైదా, షేక్ దాదావలి, షేక్ బాషు, మహబూబ్ సుభానీ, షేక్ చాంద్, షేక్ బాబావలి, షేక్ నబి, షేక్ పీరు, షేక్ జానయ్య, షేక్ బుజ్జి, షకూర్ పాల్గొన్నారు.

చంద్రబాబుపై పోలీసులకు ఫిర్యాదు

తెనాలిటౌన్: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు, నారాలోకేష్‌పై తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని, ప్రజలకు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని రూరల్ ఏఎస్ఐ హైమారావుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. పార్టీ నాయకులు సంకురు బుజ్జిబాబు, ఎల్.చినబాబు, చుండూరు గోపి, ఆదం షఫీ ఉన్నారు.

అధిక లోడు లారీకి జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళుతున్న లారీకి అధికారులు జరిమానా విధించారు. తెనాలి మండలం పెదరావూరు వద్ద అధిక ఇసుక లోడుతో వెళుతున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆదివారం గుర్తించారు. లారీ యజమానికి రూ.10 వేల జరిమానా విధించారు.

సోమేశ్వరస్వామి ఆలయం సందర్శన

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలెవరంలోని గంగాబాలత్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం ఆంజనేయ యోగ మండలి సభ్యులు సందర్శించారు. దేవాలయాల పరిశుభ్రత యోగం కార్యక్రమంలో భాగంగా యోగమండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ, సభ్యులు ఆలయాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, కె. నాగరాజు, కోమల, నాగేశ్వరరావు, లక్ష్మి, పురుషోత్తమకృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోన రఘుపతికి సత్కారం



ఎమ్మెల్యే కోన రఘుపతిని సత్కరిస్తున్న దేవేంద్రరాజు, పార్టీ నాయకులు

పిట్టలవానిపాలెం: బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ కోశాధికారిగా కూసంపూడి దేవేంద్రరాజు, కార్యవర్గ సభ్యురాలిగా చందోలు ఎంపీటీసీ షేక్ కరీమున్నీసా నియమితులైనట్లు నియామక పత్రాలను ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదివారం అందజేశారు. బాపట్లలోని ఎమ్మెల్యే స్వగృహంలో కోన రఘుపతిని మండలంలోని పలువురు నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని, జిల్లా కమిటీకి ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు మండే విజయ్‌కుమార్, అహ్మద్ హుస్సేన్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు యేట్ర అశ్విని శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు నాగిరెడ్డి, మంతెన గంగరాజు, బాపట్ల ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్‌లు బడగు ప్రకాశరావు, బొలగాని సుబ్బారావు, దబ్బుకూటి మాధవరావు, కుంతం ప్రసన్నరాజు, గుమ్మడి సీతయ్య ఉన్నారు.

చేప..చేప.. నిన్ను విక్రయించిన డబ్బులెక్కడ..?



చోడిపాలెంలో చేపలు పట్టిన చెరువు



చెరువులో చేపలు పడుతున్న దృశ్యం(ఫైల్)

పిట్టలవానిపాలెం: చోడిపాలెం చెరువుకు వేలం పాట జరగలేదు. కానీ, అందులోని చేపలు విక్రయించారు. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ కార్యదర్శికి డబ్బులిచ్చి చేపలు పట్టుకున్నానని, గతంలో చెరువు సబ్ లీజుకు తీసున్న వ్యక్తి చెబుతుంటే..ఆ నగదు పంచాయతీ ఖాతాకు జమ కాలేదని పంచాయతీ వార్డు సభ్యుడు ఒకరు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదేంటని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తే.. చెరువు వేలం పాట జరగలేదని, తనకు ఎవరూ నగదు ఇవ్వలేదని.. దీనిపై విచారణ జరిపేందుకు సోమవారం డివిజనల్ అధికారులు వస్తున్నారని సమాధానం ఇచ్చారు. ఇప్పుడు ఈ చెరువు చేపల కథేంటో తేల్చడానికి డీఎల్పీఓ శరత్‌బాబు భవనంవారిపాలేనికి వస్తున్నారు.. వివరాల్లోకి వెళితే...

మండలంలోని భవనంవారిపాలెం శివారు చోడిపాలెం గ్రామంలోని చెరువులో 2021-22 ఆర్థిక సంవత్సరానికి చేపల విక్రయానికి అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. చోడిపాలెం గ్రామానికి చెందిన రామకోటిరెడ్డి వేలం దక్కించుకుని సుబ్బారావు అనే వ్యక్తికి సబ్ లీజుకు ఇచ్చారు. గడువు ముగిసిన అనంతరం 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి బహిరంగ వేలం చేపల విక్రయానికి జరగలేదు. ఇందుకు డీఎల్‌పీఓ అనుమతికి పంచాయతీ కార్యదర్శి నివేదిక పంపాల్సి ఉంది. అయితే ఈ ఏడాది జూలైలో గతంలో సబ్ లీజుకు తీసుకున్న సుబ్బారావు మళ్లీ ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులో చేపలు పట్టుకునే ప్రయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ 1వ వార్డు సభ్యురాలి భర్త ఒకరు కొందరు గ్రామ పెద్దలతో వచ్చి దానిని అడ్డుకున్నారు. దీంతో సదరు సుబ్బారావు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ కార్యదర్శికి రూ.25 వేలు అందజేసి, చేపలు పట్టుకున్నాని చెబుతున్నాడు. అయితే అతని దగ్గర తీసుకున్న చేపల చెరువు తాలూకా నగదు గ్రామ పంచాయతీ ఖాతాలో జమకాలేదు. ఆ నగదు విషయంలో అవకతవకలు జరిగాయని 6వ వార్డు సభ్యుడు మోదుగుల శంకర్‌రెడ్డి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై.. కార్యదర్శి వసుంధర లక్ష్మిని వివరణ కోరగా.. చెరువులో చేపలు పట్టుకున్న మాట వాస్తవమేనని చెప్పారు. అయితే ఎలాంటి వేలం పాట నిర్వహించలేదని, చేపల విక్రయానికి సంబంధించి తనకు ఎలాంటి నగదు అందలేదని సమాధానం ఇచ్చారు. ఈ విషయంపై విచారించేందుకు డివిజనల్ అధికారులు సోమవారం గ్రామానికి వస్తున్నారని తెలిపారు. చేపలు పట్టుకున్న సుబ్బారావును ఫోన్‌లో సంప్రదించగా పెద్దల సమక్షంలోనే రూ.25 వేలు కార్యదర్శికి ఇచ్చి, చేపలు పట్టుకున్నానని చెప్పారు. ఇందులో ఏది నిజమో, చేపలమ్మిన నగదు ఏమైందో.. విచారణ అధికారులే తేల్చాల్సి ఉంది.

భూముల సర్వేకు సహకరించాలి

-తహసీల్దారు డి.మల్లికార్జునరావు



గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దారు డి.మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మీ భూమి-మా హామీ సర్వేకు గ్రామస్తులు సహకరించాలని తహసీల్దారు డి.మల్లికార్జునరావు కోరారు. మీ భూమి-మా హామీ కార్యక్రమంలో భాగంగా పేటేరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం గ్రామస్తులతో ఆయన అవగాహన సదస్సు నిర్వహించి, మాట్లాడారు. గ్రామ రెవెన్యూ, సర్వే అధికారులు ప్రతి ఇంటికి విచ్చి సర్వే చేస్తారని చెప్పారు. గ్రామస్తులు సహకరించి, తమ భూములను క్రమ బద్ధీకరించుకొని, శాశ్వత భూ రికార్డులు పొందాలని తెలిపారు. సర్వేతో భూ యజమానులకు ఖచ్చితమైన హద్దులు చూపటంతో పాటు శాశ్వత రెవెన్యూ భూ రికార్డులలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. దీంతో భవిష్యత్తులో భూములు, ఇతర వివాదాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు చోటు చేసుకోవని వివరించారు. కార్యక్రంలో సర్పంచ్ కనపర్తి వసుమతి, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామఇన్‌చార్జి కనపర్తి రవికిరణ్ పాల్గొన్నారు.

సీపీఎం సమర భేరి గోడ ప్రతుల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

రేపల్లె: ధరల నియంత్రణకు సెప్టెంబర్ 1 నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌లను ఆదివారం ఆవిష్కరించి, మాట్లాడారు. నిత్యావసర వస్తువులు, విద్యుత్ చార్జీలు, పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే సమర భేరిలో భాగంగా ఆగస్టు 30, 31 తేదీల్లో కర పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. సెప్టెంబర్ 1న సచివాలయ వద్ద ధర్నాలు, విద్యుత్ బిల్లుల దగ్ధం, 3న నిరుద్యోగుల సమస్యలపై నిరసనలు, 4న అన్ని మండల కేంద్రల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.ఆశీర్వాదం, కేవీ లక్ష్మణరావు, కె.రమేష్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు దోహదం

కొల్లిపర ఎంపీపీ పద్మావతి



క్రీడాపోటీల్లో గెలుపొందినవారికి బహుమతుల ప్రదానం

కొల్లిపర: విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయాలని ఇందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. మండల కేంద్రం కొల్లిపర అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో ఈషా ఫౌండేషన్ నిర్వహిస్తున్న 15వ గ్రామోత్సవం క్రీడాపోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం కూడా క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈషా ఫౌండేషన్ నిర్వహకులు కుందుల సుధాకర్, సాంబశివరావు, వివేకా విద్యాసంస్థల అధినేత వీరనారాయణ, గ్రామస్తులు అవుతు కృష్ణారెడ్డి, బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కూరపాటి రవిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవలో మానవతకు పెద్దపీట

'మానవత' రీజియన్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న కొత్త సుబ్రహ్మణ్యం

తెనాలి: సమాజ సేవలో మానవతకు పెద్దపీట వేయాలని, ప్రముఖ స్వచ్ఛంద సంస్థ మానవత రీజియన్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి లైబ్రరీ హాలులో మానవత సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానాన్ని ప్రోత్సహించటం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటం, పర్యావరణ పరిరక్షణ అంశాలతో పాటు విద్యార్థి వయసులోనే నైతిక విలువలు పెంచేలా ప్రణాళికను రూపొందించి, అమలు చేద్దామని చెప్పారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సంస్థ తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ, మంచి వ్యక్తుల కలయికతో సమాజంలో తోటివారికి సేవచేయాలనే స్ఫూర్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. సభ్యులు ఆ దిశగా కృషిచేయాలని కోరారు. రక్తదానాన్ని ప్రోత్సహించే క్రమంలో రక్తదాతలతో జాబితాను సిద్ధం చేసినట్లు తెలిపారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కల్యాణి మాట్లాడుతూ సేవను ఆచరించటం ద్వారా జీవితానికి ప్రయోజనం కలుగుతుందన్నారు. 'పోస్ట్' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు తన్నీరు శ్రీనివాసబాబు మాట్లాడుతూ, మానవతలోని మహిళా సభ్యుల్లో అవసరమైనవారికి ఉపాధిని పొందే నైపుణ్య శిక్షణను తమ సంస్థలో ఉచితంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. మానవత ఆధ్వర్యంలో రూపొందిస్తున్న పర్యావరణ హిత సంచుల తయారీ ఖర్చును భరిస్తానని చెప్పారు. సమావేశంలో డాక్టర్ జి.నాగేశ్వరరావు, వేదాంతం ఫణీంద్ర, సీబీ రమణ, పాలుడుగు ఆనందరావు మాట్లాడారు.

వ్యాధులపై అవగాహన ఉండాలి



విద్యార్థినులకు రిపోర్టులు, మందులు పంపిణీ అందజేస్తున్న భానుమతి

తెనాలిఅర్బన్: మహిళలకు వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని ఐఎంఏ రాష్ట్ర కన్వీనర్, సిద్ధార్థ మెడికల్ కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ దుర్గారాణి సూచించారు. ఐఎంఏ తెనాలి మిషన్ పింక్, హ్యాపీ హాస్పిటల్స్, జేఎంజే కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జేఎంజే కళాశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యుక్త వయస్సులో బాలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. మహిళలకు సంభవించే క్యాన్సర్‌పై హ్యాపీ హాస్పిటల్స్ నిర్వాహకులు డాక్టర్ పావని ప్రియాంక అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు డాక్టర్ శ్వేతా, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ లావణ్య, డాక్టర్ ఉష వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ తెనాలి కార్యదర్శి ముమ్మనేని భానుమతి, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ పాటిబండ్ల హేమలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణ సుజాత, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ సిహెచ్.సరోజిని, సిస్టర్ ఏమిలి, సిస్టర్ అమూల్ మేరి, సిస్టర్ విజయ పాల్గొన్నారు.

హెల్పింగ్ సోల్జర్స్ ట్రస్టు ఫౌండర్ జబీవుల్లాకు పురస్కారం



జబీవుల్లా ఫరూఖ్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

పెదకాకాని: అఖిల భారత ఎన్‌జీవోస్ సంక్షేమ సంఘం, కేబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు ఏసీ కళాశాలలో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంఘాలు, ట్రస్టులను ప్రోత్సహిస్తూ పురస్కారాలు అందజేశారు. పెదకాకాని మండలానికి చెందిన హెల్పింగ్ సోల్జర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ షేక్ జబీవుల్లా ఫరూఖ్‌కు జాతీయ సేవా రత్న పురస్కారం అందజేసి, సత్కరించారు. కార్యక్రమానికి కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కడవకంటి బాలరాజు అధ్యక్షత వహించారు. హెల్పింగ్ సోల్జర్స్ చారిటబుల్ ట్రస్ట్ సేవల్ని పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి, నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల, కేబీఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.